ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024



టమోటా @రూ.24





పలమనేరు మార్కెట్‌లో శనివారం వచ్చిన టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

పలమనేరు, మే 18: పలమనేరు మార్కెట్ యార్డులో శనివారం టమోటా ధరలు అనూహ్యంగా పెరిగాయి.రెండు నెలలుగా టమోటా ధరలు గణనీయంగా పడిపోయిన విషయం తెలిసిందే.15కిలోల బాక్సు ధర రూ.150నుంచి రూ. 180 మాత్రమే పలకడంతో టమోటా రైతులు తమకు ఈ ఏడాది టమోటా తీవ్ర నష్టాలను తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. పెట్టుబడి వ్యయం,కూలీల ధరలు, మందులు,ఎరువుల ధరలు రెట్టింపు పెరగడంతో.. టమోటాకు పలుకుతున్న ధరలతో తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోయారు. శుక్రవారం వరకు కూడా పైధరలే మార్కెట్‌లో పలకగా శనివారం మాత్రం అనూహ్యంగా 15 కిలోల బాక్సు ధరల 330 రూపాయలు పలికింది. దీంతో టమోటా రైతులు కొంత ఊరట చెందారు. రానున్న రోజుల్లో మరింత పెరిగితే తమకు కనీసం పెట్టుబడి వ్యయం అయినా చేతికందుతుందని వారంటున్నారు. పలమనేరు మార్కెట్‌లో శనివారం కిలో రూ.24 పలికిందని యార్డు కార్యదర్శి సంజీవ కుమార్ తెలిపారు. శుక్రవారం కిలో ధర కేవలం రూ.16 మాత్రమే పలికిందన్నారు. వరుసగా పడుతున్న వర్షాల కారణంగా టమోటా తోటలు దెబ్బతినడం ప్రారంభమయ్యాయని దీంతో మార్కెట్‌లో టమోటా ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

సోమల: రెండు నెలల తర్వాత శనివారం 15కిలోల టమోటా బాక్సు ధర 330కి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సోమల మండలంలో టమోటా సాగు నవంబరు నెల నుంచి దశలవారీగా వెయ్యి ఎకరాలకు మించింది. దిగుబడులు వస్తున్నా ధరలు లేక నష్టాలు మిగిల్చింది. దిగుబడులు తగ్గి కోతలు పూర్తి అవుతున్న సమయంలో ధరలు పెరుగుతున్నాయి. కాగా, ఎండలు తీవ్రంగా ఉండటంతో తోటల్లో పండ్లు మాగిపోయి రైతులు నష్టపోయారు.

మామిడి @రూ.5





సోమల మార్కెట్‌లో నేల రాలిన మామిడి

సోమల, మే 18: గాలివానకు నేల రాలిన మామిడి కాయల ధరలు కిలో రూ.5 లోపే పలకడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలీవాన బీభత్సవానికి రాలిపోతున్న మామిడి కాయలు మార్కెట్లను ముంచెత్తాయి. ఏడాది పొడవునా తోటలను సంరక్షిస్తే కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాలేదు. ఈ ఏడాది మామిడి కాపు పది శాతంకూడా లేదు. దిగుబడి చాలా తగ్గింది. వచ్చిన దిగుబడిలో సగం కాయలు ఇటీవల కురిసిన గాలి వానకు నేల రాలాయి. ఆ కాయలను మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారస్తులు రైతుల దీనపరిస్థితిని గుర్తించకుండా కిలో రూ. 2 నుంచి రూ.5 మాత్రమే ధర నిర్ణయించారు. దీనిపై రైతులు ఆందోళ చెందుతున్నారు. వ్యాపారులు మాత్రం రాలిన కాయలను తక్కువ ధరకు కొని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఓటేసేందుకు 2 గంటలు

జిల్లాలో ఓటరు ఓటేసేందుకు సగటున రెండు గంటల సమయం పట్టింది. అంతసేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఓటు హక్కు వినియోగించుకుని బాధ్యత గల పౌరుడిగా నిలవాలని అధికారులు, ఎన్నికల ఓటర్లకు అవగాహన కల్పించింది. దీంతోనూ ఓటింగ్ శాతం పెరిగింది.

మరోవైపు 197 పోలింగ్ కేంద్రాల్లో 1200కు పైగా.. మరికొన్ని చోట్ల 1400కు మించి ఓటర్లున్నారు. వీరికి కేటాయించిన సమయమెంత? ఒకవేళ ఈవీఎంలు మొరాయిస్తే అదనపు సమయం పడుతుంది? ఇవన్నీ చూసినా సాయంత్రం ఆరు గంటల్లోగా పోలింగ్ ముగియడం అసాధ్యం. అందుకే చాలాచోట్ల అర్ధరాత్రి వరకు.. ఇంకొన్ని పోలింగ్ కేంద్రాల్లో తెల్లవారుజాము వరకు పోలింగ్ జరిగింది. అటు ఓటర్లు.. ఇటు పోలింగ్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. 500 మంది ఓటర్లతో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న అంశం తెరపైకి వచ్చింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

క్యూలో నిలబడిన ఓటర్ల సగటు సమయమిది

ఓట్లు ఎక్కువగా ఉన్న కేంద్రాల విభజన ఏదీ?

197 కేంద్రాల్లో 1200కుపైగా ఓట్లు

300 కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్

500ఓట్లకు ఓ కేంద్రం ఏర్పాటు చేయాలంటున్న అధికారులు



పులిచెర్ల మండలం మతుకువారిపల్లె కేంద్రంలో రాత్రి 10 వరకు సాగిన పోలింగ్ (ఫైల్‌ఫొటో)

జిల్లాలో 1771 పోలింగ్ కేంద్రాలున్నాయి. 1188 కేంద్రాల్లో వెయ్యి కంటే తక్కువ ఓట్లుండగా.. మిగిలిన కేంద్రాల్లో వెయ్యి నుంచి 1500 మధ్యలో ఓట్లున్నాయి. ఓ వ్యక్తి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటేసేందుకు 30 సెకండ్ల సమయం పడుతుందని ఎన్నికల సంఘం చెబుతోంది. అంటే గంటకు 120 మంది అన్నట్లు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, అంటే 11 గంటల పాటు 1320 మంది ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఇది కుదరడం లేదు. ఒక్కో వ్యక్తి 30 సెకండ్లలో ఓటు వేసే పరిస్థితి లేదు. కొత్తగా ఓటు వేసేవారికి అవగాహన లేకపోవడం.. వృద్ధులు, వికలాంగుల కష్టాలు వెరసి సగటు ఓటు వేసే సమయం ఓ నిమిషంగా పరిగణించొచ్చు. దీనికితోడు ఉదయం ఈవీఎంల మొరాయింపుతో గంటసేపు ఆలస్యం. సిబ్బందికి టిఫిన్, భోజన విరామం కాసేపు. ఇలాంటి కారణాలతో వెయ్యికి మించి ఓట్లున్న కేంద్రాల్లో పోలింగ్ బాగా ఆలస్యమైంది. 1200 ఓట్లు దాటిన కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది.

సహనాన్ని పరీక్షించారు

ఎండల భయంతో ఉదయాన్నే ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లాను. అందరూ నాలానే ఆలోచించి కేంద్రం వద్ద ఎగబడి ఉన్నారు. మా కేంద్రం వద్ద 300 మంది అప్పటికే క్యూలో ఉన్నారు. అందులోనూ ఈవీఎంలు మొరాయించి పోలింగ్ అరగంట ఆలస్యమైంది. మొత్తంగా ఓటేసి బయటకు వచ్చేసరికి రెండు గంటలకుపైగా సమయం పట్టింది. ఇలా చేసి ఎన్నికల అధికారులు మా ఓర్పును, సహనాన్ని పరీక్షించారు. కొంతమంది మళ్లీ వద్దామని వెనక్కి వెళ్లిపోయారు. పోలింగ్ కేంద్రాలను విభజించి, ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

- చిత్తూరు నగరానికి చెందిన ఓటరు ఆగ్రహం

ఓట్లు ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ ఇలా..

- పులిచెర్ల మండలం మతుకువారిపల్లె కేంద్రంలో 1393 ఓట్లుండగా, 1244 పోలయ్యాయి. రాత్రి 9 వరకు పోలింగ్ సాగింది. 11 గంటలకు సిబ్బంది ప్రక్రియ ముగించుకుని కేంద్రాన్ని ఖాళీ చేశారు.
- గుడుపల్లె మండలంలోని అగరం, కమ్మగుట్టపల్లె కేంద్రాల్లో 1292, 1352 చొప్పున ఓట్లుండగా.. రాత్రి 11.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. 115శెట్టిపల్లి, కొడతనపల్లె, సోడిగానిపల్లె కేంద్రాల్లో 1200లకు మించి ఓట్లుండగా.. రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ అయింది.
- వి.కోట మండలంలో ఏకంగా 13 కేంద్రాల్లో 1200కు మించి ఓట్లున్నాయి. ఈ కేంద్రాల్లో అన్నిచోట్లా పోలింగ్ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి అయింది. ఎస్.బండపల్లెలో మాత్రం మరుసటిరోజు తెల్లారి 3 గంటలకు పోలింగ్ పూర్తయింది.
- సదుం మండలంలోని బూరగమంద, నడిగడ్డ కేంద్రాల్లో 1297, 1323 చొప్పున ఓట్లుండగా, రాత్రి 10 గంటలకు పోలింగ్ ముగిసింది. ఇదే నియోజకవర్గంలోని చౌడేపల్లె మండలం 90వ కేంద్రంలో ఏకంగా 1432 మంది ఓటర్లున్నారు. 10:30 గంటలకు పోలింగ్ ముగిసింది.
- బైరెడ్డిపల్లె మండలంలోని 6 కేంద్రాల్లో 1200లకుపైగా ఓటర్లున్నారు. ఈ కేంద్రాల్లో రాత్రి 10 గంటలకు ప్రక్రియ ముగిసింది.
- శాంతిపురం మండలంలోనూ 1200 మంది ఓటర్లకు మించిన కేంద్రాలు ఆరున్నాయి. రాత్రి 11 గంటలకు పోలింగ్ ముగించుకుని, ఒంటి గంటకు కుప్పంలోని రిసెప్షన్ కేంద్రానికి చేరుకున్నారు.
- కుప్పం నియోజకవర్గంలో 243 కేంద్రాలుండగా.. 35 చోట్ల 1200కుపైగా ఓటర్లు ఉన్నారు. దాదాపు ఈ 35 కేంద్రాల్లోనూ రాత్రి 10 గంటలకు పోలింగ్ ముగిసింది. తంబిగానిపల్లెలో మాత్రం రాత్రి 11దాకా సాగింది.



వి.కోట మండలం ఎస్.బండపల్లె కేంద్రంలో మరుసటిరోజు తెల్లారి 3 వరకు సాగిన పోలింగ్ (ఫైల్ ఫొటో)

ఇలాగైతే మాకు రోగాలు తప్పవు

ఎన్నికల నిర్వహణ మూస పద్ధతిలో నిర్వహిస్తున్నారు. అసలు ఎన్నికల సామగ్రి ఇవ్వడం, తీసుకోవడం పోలింగ్ కేంద్రాల్లోనే జరగాలి. భోజన విరామం కనీసం 20 నిమిషాలు ఇవ్వాలి. అన్ని సాంకేతిక సమస్యలకూ సిబ్బందినే బాధ్యుల్ని, నేరస్థుల్ని చేయడం బాగాలేదు. చట్టం పేరుతో పై అధికారులు సిబ్బందిని చిత్ర హింసలు పెడుతున్నారు. కనీసం తాగేందుకు మంచి నీళ్లు ఇచ్చేవాళ్లు ఉండడం లేదు. ఐదేళ్లకోసారి ఎన్నికలు కాబట్టి సరిపోయింది. ఏడాదికోసారి వస్తే సిబ్బంది అనారోగ్యంతోనే చస్తారు. సాధారణ గ్రామీణ ఓటరుకు ఓటు ఎలా వేయాలో కూడా డెమో ఇప్పించకుండా ఓటు వేయమని ఊదరగొడుతున్నారు. ఎక్కడ నొక్కాలో యువ ఓటర్లకు కూడా అవగాహన లేదు. వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉన్నా గ్రామాల్లో వినియోగించుకోలేదు. ఓటు వేయలేని వారికి తోడు పేరుతో కేంద్రంలోపలకు వచ్చి ఆయా పార్టీల నాయకులు అధికారికంగా రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6లోగా ప్రశాంతంగా ఓటు వేయాలంటే ప్రతి కేంద్రంలో 400-500 మధ్యలో ఓట్లు, కనీసం ముగ్గురు పోలీసులతో భద్రత ఉండాలి.

- ఎన్నికల నిర్వహణపై జిల్లాలో పోలింగ్ విధుల్లో పాల్గొన్న ఓ అధికారి మాట

902 సార్లు చెప్పాల్సి వచ్చింది

'అమ్మా.. మీకు నచ్చిన గుర్తు ఎదురుగా బ్లూ బటన్‌ని నొక్కితే రెడ్ లైట్ వెలుగుతుంది. పక్కన డబ్బాలో మీ ఓటు స్లిప్ రూపంలో కనిపిస్తుంది' అని 966 ఓట్లున్న కేంద్రంలో 902 సార్లు చెప్పాల్సి వచ్చింది. హమ్మయ్యా, 64 మంది సూచన లేకుండా ఓటేశారనుకోవద్దు. అక్కడ పోలైంది 902 ఓట్లే.

- జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టిన మెసేజ్ ఇది. ఓటు హక్కు వినియోగించుకుని బాధ్యత గల పౌరుడిగా నిలవమని ప్రకటనలతో ఊదరగొట్టిన ఎన్నికల అధికారులు.. గ్రామాల్లో ఓటు వేసేవారికి ఏమాత్రం అవగాహన కల్పించలేదని తెలుస్తోంది.

ఇలా చేస్తే సత్ఫలితాలు

ఇప్పుడు 1400 మంది ఓటర్లున్నా ఒకటే కేంద్రం పెట్టారు. అలా కాకుండా 500 ఓట్లు మించితే పోలింగ్ కేంద్రాన్ని విభజించాలి. అర్ధరాత్రి వరకు పోలింగ్ ఇబ్బందులు తప్పుతాయి. ఇప్పుడు నాలుగైదు కేంద్రాలున్న పోలింగ్ ప్రాంతానికి ఒకరే కానిస్టేబుల్‌ను ఉంచారు. అలా కాకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా కనీసం ఇద్దరికి తగ్గకుండా పోలీసులు ఉండాలి.

ఓట్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాలు
1400-1500	20
1300-1400	64
1200-1300	113
1100-1200	182
1000-1100	204
వెయ్యి లోపు	1188

వెల్లువెత్తిన మహిళా చైతన్యం

కుప్పంలో పెరిగిన ఓటింగ్ శాతం

ఎవరికి లాభమంటూ ప్రధాన పార్టీలలో మల్లగుల్లాలు

2019 ఎన్నికల్లో.. : నియోజకవర్గంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 2,13,146. ఇందులో 1,82,087 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 31,059 మంది ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు. అప్పట్లో మహిళా ఓటర్లు 1,05,539 మంది కాగా, వారిలో 89,980 మంది ఓటు వేశారు. అంటే మిగిలిన 15,559 మంది ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు.

2024 ఎన్నికల్లో.. : కుప్పంలో మొత్తం 2,25,775 మంది ఓటర్లు నమోదు కాగా 2,02,920 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవలం 22,855 మంది మాత్రమే ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఏకంగా 89.88 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం మహిళా ఓటర్లు 1,13,247 మంది కాగా, వీరిలో 1,01,608 మంది ఓటు వేశారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి, అర్ధరాత్రి దాటుతున్నా విసుగు చెందకుండా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

2019 ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ సరళిని బట్టి, ఈ ఎన్నికల్లో కేవలం 3,920 మంది మహిళా ఓటర్లు మాత్రమే వివిధ కారణాలతో ఓటింగ్‌కు హాజరు కాలేదు. దీనికి విరుద్ధంగా పురుషుల విషయంలో గత ఎన్నికలతో పోలిస్తే 4,279 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. అంటే మహిళా చైతన్యం పెరిగింది. మహిళలతో పోలిస్తే ఓటేయని పురుషుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇప్పుడు ఆ మహిళా ఓటు ఎటువైపు అన్నదే ప్రధాన పార్టీల్లో మల్లగుల్లాలు పడుతున్నారు.

కుప్పం నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో పెరిగిన మహిళా చైతన్యంమీదనే ప్రస్తుతం చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఎక్కడ క్యూలైన్లలో చూసినా మహిళలు బారులుతీరి కనిపించారు. కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లె, శీగలపల్లె, గుడుపల్లె మండలం శెట్టిపల్లె, శాంతిపురం మండలం ఎంకే.పురం తదితర పోలింగ్ బూతుల్లో రాత్రి 10 గంటల నుంచి 11గంటలదాకా కూడా పోలింగ్ కొనసాగింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆయా పోలింగ్ బూతుల గేట్లు మూసేయడంతో ఎన్నికల సిబ్బంది ఇచ్చే టోకెన్లకోసం తంబిగానిపల్లె వంటి కేంద్రాల్లో ఓటర్ల మధ్య తొక్కిసలాటలు సైతం జరిగాయి. అయినా కలబడి మరీ నిలబడి మహిళలు ఓటు వేసిన తర్వాతనే ఇళ్లకు తిరిగి వెళ్లారు. చంటిబిడ్డల సహా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మళ్లీ ఎక్కడా ఓటర్లకు ప్రధాన పార్టీలు ఆటోలు వంటి రవాణా సదుపాయాలు సమకూర్చిన దాఖలాలు కూడా కనపించలేదు. గత ఎన్నికల్లో అయితే ఆటోలు పెట్టి మరీ ఓటర్లను బూత్‌లకు తరలించాల్సి వచ్చింది. ఇప్పుడా పరిస్థితి కనిపించలేదు. ఓటర్లు అందులోనూ మరీ ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి, గంటలకు గంటలు నిలబడి ఓటేశారు. ఈ పెరిగిన మహిళా ఓటింగ్ ఏ పార్టీకి లాభమన్న చర్చలు ప్రస్తుతం నడుస్తున్నాయి. నవరత్నాల పథకాలు ఇలా మహిళలను పోలింగ్ బూత్‌లకు రప్పించాయని వైసీపీ చెప్పుకుంటోంది. ఈసారి టీడీపీ అభ్యర్థి చంద్రబాబు మెజారిటీ గణనీయంగా తగ్గడం ఖాయమని ఊదరగొడుతోంది. దీనికి టీడీపీనుంచి దీటుగా సమాధానం వినిపిస్తోంది. అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయని, తత్ఫలితంగానే మహిళలు పెద్ద సంఖ్యలో క్యూలు కట్టారని ఆ పార్టీ శ్రేణులు నమ్ముతున్నాయి. నియోజకవర్గంలో కొనసాగిన వైసీపీ అరాచకాలు, అక్రమ కేసులు కూడా మహిళల్లో ఆ పార్టీపట్ల వ్యతిరేకత పెంచి, ఎలాగైనా చంద్రబాబుకు అత్యధిక మెజారిటీ ఇవ్వాలన్న కసితో ఓటింగ్‌లో పాల్గొన్నారని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

- కుప్పం



తంబిగానిపల్లె 197 పోలింగ్ బూత్ వద్ద చంటిబిడ్డ సహా క్యూలైన్లలో నిలబడ్డ మహిళలు (ఫైల్ ఫొటో)

పెదవి విప్పని మహిళా లోకం

ఎవరికి ఓటు వేశారన్న విషయంలో మాత్రం మహిళలు పెదవి విప్పడం లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా మౌనంగా నిలబడి లోకాభిరామాయణాలు మాట్లాడుకోవడం, తమ వంతు రావడానికి ఆలస్యమవుతున్నకొద్దీ ఆ కష్టాల గురించి ఒకరికొకరు ఏకరువు పెట్టుకోవడం తప్ప మరో మాట మహిళల నుంచి రాలేదు. ఇప్పటి వరకూ తాము ఎవరికి ఓటేశామన్న విషయంలో వారు గుంభనగానే వ్యవహరిస్తున్నారు. ఓటు విషయంలో మహిళలు పాటిస్తున్న ఈ గోప్యతే ప్రస్తుతం ప్రధాన పార్టీలలో గుబులు రెట్టింపు చేస్తోంది.

ఎన్నికల విధులకు 228 మంది డుమ్మా

- షోకాజ్ నోటీసులు జారీ

చిత్తూరు కలెక్టరేట్, మే 18: ఎన్నికల విధులకు గైర్హాజరైన 228 మందిపై జిల్లా యంత్రాంగం సీరియస్ అయ్యింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఆదేశాలను ధిక్కరిస్తూ 36 మంది పీవోలు, 22మంది ఏపీవోలు, 170 మంది ఓపీవోలు విధులకు డుమ్మా కొట్టారు. విధులకు గైర్హాజరైన వారి స్థానంలో రిజర్వులు ఉన్న వారి సేవలు పొంది ఎన్నికలు పనులు పూర్తిచేశారు. గైర్హాజరైన 228మందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరిట షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. విధులకు ఎందుకు గైర్హాజరయ్యారో తెలుపుతూ షోకాజ్ నోటీసు అందిన 48 గంటల్లో కలెక్టరేట్‌కు సమాధానం పంపాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో చాలామంది ఉపాధ్యాయులుండగా, వారిని తొలుత ఓ నియోజకవర్గంలో విధులు కేటాయించి, ఆ తర్వాత మరో నియోజకవర్గానికి విధులు కేటాయించడం, కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో తాము ఎన్నికల విధులకు హాజరుకాలేమంటూ గతంలోనే విన్నవించుకున్నా కూడా వారికి కూడా విధులు కేటాయించడం వంటివి జరిగినట్లు తెలిసింది.

సీయూఈటీ పరీక్షలకు 56 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మే 18: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి శనివారం వరకు జరిగిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)కు 56 మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ వైవీ కృష్ణబాబు తెలిపారు. 148 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, పీఈఎస్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన పరీక్షలకు 92 మంది హాజరు కాగా, 56 మంది గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), మే 18: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలో భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకోకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు.



నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ


హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం), మే 18 : తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధనరాజు నియమితుల య్యారు. ఆదివారం ఆయన తిరుపతికి చేరుకుని బాధ్యతలు చేపట్టనున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన హర్షవర్ధన రాజు గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. అనంతరం నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు.విజయవాడ డీసీపీగా,అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేశారు.ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చేవారని సమాచారం. ముక్కుసూటిగా పనిచేస్తారనే పేరుపడ్డ ఈయన్ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల బీహార్ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమించింది.ప్రస్తుతం సీఐడీ విభాగం నుంచి తిరుపతి కి ఎస్పీగా రానున్నారు.

తిరుపతికి చేరిన సిట్ బృందం

ఎన్నికల కేసులపై నేడు విచారణ, పునఃసమీక్ష

తిరుపతి(నేరవిభాగం), మే 18 : ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) నేడు తిరుపతిలో విచారణ చేపట్టనుంది.తిరుపతి జిల్లాలో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయనుంది.సిట్ బృందంలోని ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ శనివారం రాత్రి 12గంటలకు తిరుపతికి చేరుకున్నారు.ఆదివారం ఉదయం నుంచే వీరు దర్యాప్తు ప్రారంభిస్తారు.రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాలువ, పాకాల మండలం పులివర్తివారి పల్లి, చంద్రగిరి మండలం కూచువారిపల్లి, తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద జరిగిన హింసాత్మక ఘటనలపై లోతుగా విచారించనున్నారు. వీటితో పాటు గూడూరు, వెంకటగిరి, చిల్లకూరు ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలపైనా విచారణ చేపడతారు.వీటికి సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లను పునః సమీక్షించనున్నారు.

టిప్పర్ బోల్తా : డ్రైవర్ మృతి


బోల్తాపడిన టిప్పర్ - కేబిన్‌లో ఇరుక్కుపోయిన రాజేష్ మృతదేహం

బంగారుపాళ్యం, మే 18: టిప్పర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఎగువ బందార్లపల్లె వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. చెన్నై - బెంగళూరు హైవే పనుల్లో భాగంగా టిప్పర్‌లో తెచ్చిన మట్టిని ట్రిప్పింగ్ చేస్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ఈ క్రమంలో హైడ్రాలిక్ విరిగిపోయి కేబిన్‌లో ఉన్న డ్రైవర్ రాజేష్ (35) కడుపులో గుచ్చుకుపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

సోమల, మే 18: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందాడు. సోమల మండలం పేటూరు పంచాయతీ పొలికిమాకుల పల్లెకు చెందిన జయరాంరెడ్డి, మమత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నకుమారుడు చేతన్ కుమార్‌రెడ్డి (7) శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని నీటి కుంట వద్దకు బహిర్భూమికని ఒంటరిగా వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగి పోయాడు. గ్రామస్తులు గుర్తించి చేతన్ కుమార్ మృత దేహాన్ని వెలితీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం .. ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో పోలీసులు

రామకుప్పం, మే 18: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శివ కుమార్ కథనం మేరకు.. రామ కుప్పం మండలం పచ్చారుమాకులపల్లెకు చెందిన అంజిరాజు, ప్రభు కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో మద్యం రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ శివకుమార్ నేతృత్వంలో పోలీసుల గ్రామ పొలిమేర్లలో కాపుగాసి ద్విచక్రవాహనంలో వస్తున్న నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు. మద్యం విలువ సుమారు రూ.12,000 ఉంటుంది.

23 నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), మే 18: ఖరీఫ్ సీజన్‌కుగాను జిల్లాలో ఈనెల 23 నుంచి సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. 'ఖరీఫ్ సాగుకు ప్రణాళికేది?' అంటూ శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. **ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్** ఖరీఫ్ సీజన్‌కు గాను 38,655 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఆర్బీకేల ద్వారా 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వేరుశనగ కే6 రకం బస్తా (30 కిలోలు) పూర్తి ధర రూ.1710 కాగా, రాయితీ రూ.684 పోను రైతు వాటా కింద రూ.1026 చెల్లించాలన్నారు. నారాయణి రకం బస్తా (30 కిలోల) పూర్తి ధర రూ.1746 కాగా, రాయితీ రూ.698 పోను రైతు వాటా కింద రూ.1048 చెల్లించాలని తెలిపారు. సబ్సిడీ విత్తనాల పంపిణీలో కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఆర్బీకే కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, మే 18: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,987మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,680మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రాహు కేతు పూజలు రూ.500 టిక్కెట్ల ద్వారా 2,846మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,049, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 248మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 264మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 79మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. మొత్తంగా 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే 21,055 ప్రసాదాలు అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం


స్వామి అమ్మవార్లకు అభిషేకం

శ్రీకాళహస్తి, మే 18: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్న కొట్టాయిఉత్సవం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. మొదట స్వామి అమ్మవార్లకు పగడ చెట్టు వద్ద విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

జోగివారిపల్లెలో గజ బీభత్సం


ఏనుగులు కూల్చివేసిన కంచె - విరిచేసిన మామిడి చెట్ల కొమ్మలు


తొక్కేసిన టమోటా పంట

సదుం, మే 18: మండలంలోని జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతాల్లోని పంట పొలాల్లో తరచూ ఏనుగుల సంచారం, వాటి వల్ల వాటిల్లుతున్న పంట పొలాల నష్టం ప్రాంత వాసుల్లో వణకు పుట్టిస్తోంది. రెండు రోజుల క్రితం బత్తలారిపల్లెలో విద్యుత్ స్తంభాలు, డ్రిప్ పరికరాలు నష్టపరచిన ఏనుగులు తాజాగా శుక్రవారం రాత్రి అదే బత్తలవారిపల్లె, జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతంలోని మామిడి, వరి, టమోటా, పశుగ్రాస పంటలు, నీటిని సరఫరా చేసే పీవీసీ పైపులు, తోటలకు ఏర్పాటు చేసిన ఇనుప తీగల కంచెలను నష్టపరిచి, తరచూ గ్రామ సమీపాల్లో ఏనుగుల సంచార నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు నరసింహారెడ్డి, రెడ్డప్ప రెడ్డి, జ్యోతి, సురేశ్ రెడ్డి, రఘు, స్థానికులు కోరుతున్నారు.

అంకాళపరమేశ్వరిగుడి పాత పూజారి కిడ్నాప్

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం ● మీడియాకు వివరించిన బాధితుడు


అగరమంగళం గ్రామానికి సమీపంలో గల అంకాళపరమేశ్వరి ఆలయం - పూజారి రామచంద్రన్

గంగాధరనెల్లూరు, మే 18: గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం సమీపంలోని అంకాళపరమేశ్వరి గుడి పాత పూజారిని కొందరు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితుడు, అగరమంగళం దళితవాడకు చెందిన రామచంద్రన్ శనివారం మీడియాతో మాట్లాడారు. 'చాలా ఏళ్ల కిందట దళితవాడకు సమీపంలోని సొంత భూమిలో షెడ్డు నిర్మించుకుని అంకాళపరమేశ్వరి గుడికి పూజారిగా ఉంటూ పూజలు చేసుకుంటున్నా. ఆ గుడికి కొన్నేళ్ల క్రితం బెంగళూరుకు చెందిన దీపక్‌కుమార్ తాళ్ల వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. తమ దీర్ఘకాల సమస్య పరిష్కారమైందంటూ ఆయన మళ్లీ గుడికి వచ్చారు. పాత గుడి స్థానంలో కొత్తది నిర్మిస్తానని చెప్పారు. పాత గుడిస్థలంతో పాటు మరికొంతభూమిని స్థానికులవద్ద సేకరించి.. పెద్దఎత్తున గుడి నిర్మించారు. పూజలు కొనసాగిస్తూ వస్తూ కొత్త గుడికి చైర్మన్‌గా దీపక్‌కుమార్ తాళ్ళ వ్యవహరిస్తున్నారు. శ్రీరంగరాజపురం మండలం కొటార్లపల్లె వద్ద స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీకి కూడీ ఈయనే చైర్మన్. కొత్తగుడి చైర్మన్ దీపక్‌కుమార్ గుడిపేరుతో కొత్త ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆ ట్రస్ట్‌లో నాకు అవకాశం లేకుండా చేశారు. గుడి పరిసరాలకు రానీయడంలేదు' అని రామచంద్రన్ వివరించారు. కొంతకాలంగా కొత్తగుడి పరంగా వారితో తనకు వివాదం కొనసాగుతోందన్నారు.తమ కుటుంబసభ్యులకు సంబంధించి భూమిని దీపక్‌కుమార్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై పలుసార్లు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకుని కోర్టులను సైతం ఆశ్రయించినట్లు వివరించారు. సుమారు 20 రోజుల క్రితం పొలాల్లో మేకలు మేపుకుంటున్న తనను తమిళనాడు పోలీసుల డ్రస్‌లతో కొంతమంది వచ్చి కాట్పాడి పోలీస్‌స్టేషన్‌కు విచారణకు రావాలని బలవంతంగా వాహనంలో తీసుకెళ్లారన్నారు.కొటార్లపల్లె వద్ద గల స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీ వద్దకు.. అక్కడ్నుంచి పళ్ళిపట్టు మీదుగా వివిధ ప్రాంతాల్లో తిప్పిస్తూ 10రోజులుగా తనను ఇబ్బంది పెట్టారన్నారు. ప్రాణాలు తీసేందుకు ఇంజక్షన్ వేశారన్నారు. తాను కొద్దిరోజులుగా కనపడటం లేదని తమ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. అంతలోగానే తాను కిడ్నాపర్లనుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించానని ఆయన చెప్పారు. కాగా, దీనికి సంబంధించి దీపక్‌కుమార్ తాళ్ళతో పాటు 11మందిపై కిడ్నాప్ కేసు నమోదైనట్లు తెలిసింది. వారిలో నలుగురిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. కిడ్నాప్‌కేసులో మరికొంతమంది పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన విషయమై గంగాధరనెల్లూరు సీఐ శంకర్‌ను వివరణ కోరగా.. ఈ కేసు సుమారు నెల రోజుల కిందటిదని చెప్పారు. డీఎస్పీ స్థాయిలో కేసు కొనసాగుతోందన్నారు.


తిరుపతి కలెక్టర్‌కు రికార్డులు అప్పగించండి

ఎపిక్ కార్డుల కేసు విషయమై చిత్తూరు కలెక్టర్‌కు ప్రభుత్వ ఆదేశం

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల క్రితం జరిగిన తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ కేసులో రికార్డులను తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాధీనం చేయాలని చిత్తూరు కలెక్టర్‌ను శనివారం సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశించారు.తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 36 వేల ఓటరు కార్డులను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచీ ఎలాంటి క్లెయిమ్‌లూ లేకుండా డౌన్‌లోడ్ చేసిన ఈ కేసులో బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రెజెంటింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు తిరుపతిలో జరిగినప్పటికీ చిత్తూరు కలెక్టర్ ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో పర్యవేక్షణ బాధ్యత వహించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న సంబంధిత రికార్డులను తిరుపతి కలెక్టర్‌కు అప్పగించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై

గోవిందుడి చిద్విలాసం


సింహ వాహనం - ముత్యపు పందిరి వాహనం

తిరుపతి(కల్చరల్), మే 18: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఏడు గంటలకు సింహవాహనంపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి ఏడు గంటలకు ముత్యపు పందిరి వాహనసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మాడవీధుల్లో స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. వాహన సేవ ముందు వివిధ కళారూపాల ప్రదర్శనలు అలరించాయి. ప్రధానంగా కోలాటం, వీరనృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాహన సేవ ముందు వేదపండితులు, జీయరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, భక్తులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహన సేవలు జరుగుతాయి.



వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాలపేట, మే 18: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీదుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,510 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 43,199 మంది తలనీలాలు సమర్పించారు.

పరిశోధనల్లో మెలకువలకు అవకాశం


ఎస్వీయూ ప్రతినిధులతో ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

తిరుపతి (వైద్యం), మే 18: ఎస్వీయూతో తమకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరితే మెడికల్, నాన్ మెడికల్ విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధనల్లో మెలకువలను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల, ఎస్వీయూ మధ్య ఎంవోయూపై చర్చించడానికి శనివారం తొలి సమావేశం ఎస్వీయూలో నిర్వహించారు. ఈ ఒప్పందం కుదిరితే సోషల్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిపై పలు విభాగాలతో చర్చించాక వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ఎస్వీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, సునీత పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 18: జిల్లాలో శుక్రవారం ఉదయం 8నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 14 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షాలు కురిశాయి. గంగవరంలో 70.4మి.మీ, పలమనేరు 53.0, వెదురుకుప్పం 46.2, వి.కోట 44.2, బైరెడ్డిపల్లి 29.2, చౌడేపల్లి 16.2, పెద్దపంజాణి 9.2, రామకుప్పం 4.8, శ్రీరంగరాజపురం 3.6, గుడుపల్లి 3.4, నగరి 3.2, పుంగనూరు 3.2, శాంతిపురం 2.0, పాలసముద్రం 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెల సగటు వర్షపాతం 67.2 మి.మీ నమోదు కావాల్సివుండగా, శనివారం వరకు 63.9 మి.మీ నమోదైంది.

నాలుగు కేంద్రాల్లో

రీ పోలింగ్ జరిపించండి

ఎమ్మెల్యే చెవిరెడ్డి అభ్యర్థన - ఈసీకి నివేదిస్తామన్న కలెక్టర్

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోరినట్టు సమాచారం. శనివారం కలెక్టరేట్‌కు వెళ్ళి జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌ను కలసిన చెవిరెడ్డి పాకాల మండలం నేలదానిపల్లికి చెందిన 64వ నంబరు పోలింగ్ కేంద్రం,రామచంద్రాపురం మండలం చిన్నరామాపురానికి చెందిన 110వ నంబరు పోలింగ్ కేంద్రం, చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన 156వ నంబరు పోలింగ్ కేంద్రం,కల్‌రోడ్డుపల్లికి చెందిన 157వ నంబరు పోలింగ్ కేంద్రంలో రీ పోలింగ్ నిర్వహించాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించినట్టు తెలిసింది.అయితే పోలింగ్ సిబ్బంది నుంచీ గానీ, ఇరు పార్టీలకు చెందిన ఏజంట్ల నుంచీ గానీ, పరిశీలకుల నుంచీ గానీ ఎలాంటి ఫిర్యాదులు లేనందున రీ పోలింగ్ విషయంలో తానేమీ చేయలేనని, విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈసీ స్పందించని పక్షంలో హైకోర్టును ఆశ్రయించాలని చెవిరెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. కలెక్టర్‌ను కలసిన చెవిరెడ్డి వెంట ఆయన చిన్న కుమారుడు హర్షిత్‌రెడ్డి, న్యాయవాది వున్నట్టు తెలిసింది. గత ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన ఫిర్యాదుతో ఆరు కేంద్రాల్లో రీ పోలింగ్‌కు ఈసీ ఆదేశించిన సంగతి తెలిసిందే. అప్పట్లో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఫిర్యాదుతో ఒక కేంద్రంలో రీ పోలింగ్ నిర్వహించారు.

మెజారిటీపై ఎవరి ధీమా వారిదే..!

రామకుప్పం, మే 18: రామకుప్పం మండలంలో టీడీపీకి అనుకూలంగా పోలింగ్ జరిగినట్టు ఆ పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 88.94 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 45,935మంది ఓటర్లుండగా 40,855 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో మండలంలో టీడీపీ అభ్యర్థి చంద్రబాబుకు కేవలం 3565 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. ఆ 3565 ఓట్ల మెజారిటీలో ఒక్క రామకుప్పం పంచాయతీలో 1346 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఈ సారి ప్రభుత్వ వ్యతిరేకత, అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి పట్ల అసంతృప్తి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు ఆకర్షితులు కావడంతో టీడీపీకి గతంలో కంటే అత్యంత మెజారిటీ వస్తుందని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో టీడీపీ అభ్యర్థికి 12500 నుంచి 15000వరకు మెజారిటీ వస్తుందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు వైసీపీ శ్రేణులు సైతం మండలంలో తమ అభ్యర్థికి మెజారిటీ వస్తుందంటున్నారు. సంక్షేమ పథకాల పట్ల కృతజ్ఞత భావంతో ఓటర్లు తమ పార్టీవైపు మొగ్గు చూపారని చెబుతున్నారు. 1000 నుంచి 1500 వరకు మెజారిటీ రావచ్చంటున్నారు.

గంగమ్మకు 108 కలశాలతో అభిషేకం



కలశాలతో బయలు దేరిన మహిళలు

పలమనేరు, మే18 : పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శనివారం పట్టణంలోని గాండ్ల సంఘం ఆధ్వర్యంలో మహిళలు 108 కలశాలతో జలం తీసుకొని గంగమ్మ ఆలయానికి ఊరే గింపుగా తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గంగమ్మ గుడివద్ద గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. గంగజాతర సందర్భంగా రోజుకో కుల సంఘం వారు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గాండ్ల కులస్తులు సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సంఘం నాయ కులు, అధిక సంఖ్యలో గాండ్లకుస్తులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై అమ్మవారి చిద్విలాసం

కుప్పం, మే 18: కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలలో భాగంగా ముత్తుమారెమ్మ అమ్మవారు శనివారం రాత్రి సింహ వాహనంపై పుర విహారం చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలం కరణలు చేశారు. మూలమూర్తికి హారుతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు ఆలయా నికి వచ్చి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధరకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని వైభవంగా ఊరేగించారు. భక్తులకు కర్పూర హారతులు సమర్పించారు.

నంది వాహనంపై మృత్యుంజయేశ్వరుడి అభయం



చౌడేపల్లె, మే18: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో 6వ రోజు నంది వాహనంపై ఆది దంపతులు ఊరేగారు. శనివారం ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధా నార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షతులు పంచామృ తాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పగలు నంది వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠింప చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఊరేగించారు. రాత్రి మరోసారి నంది వాహనంపై ఊరేగారు. మంగళ వాయిద్యాల, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు సమర్పించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయ దారులుగా జర్నలిస్ట్ రామనాథం కుటుంబ సభ్యులు, తుంగా వెంకటేష్‌బాబు, తుంగా నాగరాజు, అమరనాథ్, తుంగా భాగ్యమ్మ, శివశంకర్ కుటుంబీకులు వ్యవహరించారు.

వైభవంగా వాసవీ జయంతి



విశేషాలంకరణలో వాసవీమాత మూలమూర్తి, పంచాశ్వరథంలో అమ్మవారు

రామకుప్పం, మే 18: రామకుప్పంలో ఆర్యవైశ్యులు శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఉదయం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద గంగపూజ చేశారు. అనంతరం ఆలయంలో వివిధ రకాల హోమాలు నిర్వహించి, అమ్మవారి మూల మూర్తికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. మధ్యాహ్నం మహామంగళ హారతి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులుఅమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో పంచాశ్వరథంలో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు.

భార్య మందలించిందని.. ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, మే18: మద్యానికి బానిసైన భర్తను మందలించడంతో భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన పుంగనూరులో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.... పుంగనూరులోని బీడి కాలనీకి చెందిన బావాజాన్(34) మేస్త్రీ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. దీనిపై దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఉదయాన్నే పనికి వెళ్లకుండా మద్యం తాగాడు. ఈ విషయంపై భార్య అతడిని మందలించింది. తర్వాత ఆమె కూలి పనికి వెళ్లింది. ఆ తర్వాత అతడు పురుగుల మందు తాగేశాడు. ఇంటి వద్ద ఆపస్మారకస్థితిలో పడివుండగా స్థానికులు గమనించి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వాసవీ దేవికి విశేషపూజలు



బైరెడ్డిపల్లె, మే 18 : బైరెడ్డిపల్లెలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ గావించి అర్చకులు ప్రత్యేకపూజలు, మహాగణపతిపూజ, కలశస్థాపన, వాసవీహోమం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాసవీ ఫౌండేషన్, కుసుమ పుత్రి యువజన సంఘం, వాసవీ మహిళామండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాధితులకు టీడీపీ నాయకుల పరామర్శ



కేశవులును పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, మే 18 : మండలంలోని బాపలనత్తంలో ఈ నెల 13వ తేదీ రాత్రి వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు కేశవులు, నందగోపాల్‌ను శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పరామర్శించారు. తాము అండగా ఉంటామని బాధితుల కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

రేపు డయల్ యువర్ డీఎం

పలమనేరు, మే18 : పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈ నెల 20వ తేదీ సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. 20వతేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225678 నంబరుకు ఫోన్‌చేసి ప్రయాణికులు వారి ఫిర్యాదులు, బస్సు సర్వీసులపై సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు.

23న అఖండ సంగీత ధ్యానం

పలమనేరు, మే18 : పలమనేరు సమీపంలోని గంటావూరు వద్ద వెలసిన శనీశ్వర ఆలయం వద్ద నిర్మించిన పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఈనెల 23న అఖండ సంగీత ధ్యాన కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు కార్య నిర్వాహకులు రవీంద్రశెట్టి, చిన్నయ్య శెట్టి తెలిపారు. 23వ తేదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సంగీత ధ్యానం, 7 గంటలకు సిరి కూచిపూడి నృత్యం, 8.30 గంటలకు అల్పాహారం, 9నుంచి 10 గంటల వరకు సీనియర్ పిరమిడ్ మాస్టర్లచే ఆధ్యాత్మిక సందేశం ఉంటుందని వివరించారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఏప్రిల్18: మండలంలోని బొమ్మయ్య గారిపల్లె పంచాయతీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి హరి స్వామి స్వామికి అభిషేకం, అర్చనలు, చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మే18: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని పూజగానిపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ గడిదేశి గ్రామానికి చెందిన మునిరెడ్డి(65), చంద్రారెడ్డి(62) ద్విచక్ర వాహనంలో సొంతపనులపై శుక్రవారం రాత్రి పుంగనూరుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో పూజగానిపల్లె క్రాస్‌రోడ్డులో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు గమనించి వారిని చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

పుంగనూరు, మే18: పుంగనూరు బజారువీధిలో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయాన్నే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పాలాభిషేకం, హోమాలు, నిత్యపూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు మంగళ హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పుంగనూరు రూరల్, మే 18: పుంగనూరు మండలం ఏడూరు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు నటరాజస్వామి ఆధ్వర్యంలో నరసింహస్వామికి సుప్రభాత సేవ, అభిషేకం, హోమాది కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాసవీమాతకు ప్రత్యేకపూజలు



పలమనేరులో ఫల, పుష్పాలంకరణలో వాసవీ అమ్మవారు, చౌడేపల్లె, రొంపిచెర్లల్లో ప్రత్యేక అలంకరణ, చౌడేపల్లెలో హోమాలు చేస్తున్న ఆర్యవైశ్యులు



పలమనేరులో అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

పలమనేరు, మే18: పలమనేరులో శనివారం ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవి అమ్మవారి జయంతిని ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి అమ్మవారిని ఫల, పుష్పాలతో అలంక రించారు. అనంతరం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేదపండితులు లలితాహోమం జరిపించారు. పూర్ణాహుతి, మహా మంగళహారతి సమర్పించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ. ఆర్యవైశ్యమండలి, కన్యకా పరమేశ్వరి ఎడ్యుకేషనల్ ట్రస్టు, వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ వనిత ఇంటర్నేషనల్, వాసవి సేవాసమితి, వాసవి వైభవ కమిటీ, ఆర్యవైశ్య వినాయక చవితి కమిటీ, వాసవి ఆర్యవైశ్య గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వెలసిన కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో వాసవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేద పండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. భక్తులకు ఆర్య వైశ్యులు అన్న దానం చేశారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని అరటి, మామిడాకుల తోరణాలతో, పూలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పిండి వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. కుంకుమార్చనలు చేశారు. అన్నదానాలు నిర్వహించారు.

23నుంచి వేరుశనగ విత్తన కాయల పంపిణీ



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

సోమల, మే 18: ఈ నెల 23 నుంచి వేరుశనగ విత్తన కాయలు సబ్సిడీ ధరతో పంపిణీ చేయనున్నట్లు పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. శనివారం సోమల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో 8 మండలాల ఆర్బీకే సిబ్బందికి వేరుశనగ విత్తకాయల పంపిణీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో ప్రతి ఆర్బీకేలో వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం సీల్ వేసిన టోకెన్ ఇవ్వాలన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ ఫోన్ తీసుకుని రావాలన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని వ్యవసాయ అధికారులు సుధాకర్, రాజేశ్, జ్యోతమ్మ, రఖీబా, శ్రీనివాసులు, ఫయాజ్, సోమల, సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల, పుంగనూరు, చౌడేపల్లె, రామసముద్రం, పెద్దపంజాణి మండలాల ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

చౌడేపల్లె: రాయితీ వేరుశగవిత్తన కాయలకోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జ్యోతి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. క్వింటాల్ విత్తన కాయలు మార్కెట్ ధర రూ.9500కాగా 40శాతం రాయితీతో రూ.5700తో అందిస్తామన్నారు. 30కిలోల బస్తా ధర రూ.1710తో రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కే6, టీసీజీఎస్ రకాల కాయలు ఉన్నాయని వివరించారు. రైతులు తమ పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో పాటు వారి సెల్‌ఫోన్లు తీసుకురావాలని సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి

రామకుప్పం: మండలంలోని రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం ఈ నెల 23 నుంచి ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అమృత కోరారు. ఈ సారి మండలానికి 1543 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు వచ్చాయని వివరించారు.

ప్రభుత్వాస్పత్రి పనితీరు మెరుగుపడాలి

- సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు రూరల్, మే 18: చిత్తూరు ప్రభుత్వాస్పత్రిపై ఇటీవల ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మెరుగుపరుచుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యం సక్రమంగా అందడం లేదని, అత్యవసర విభాగంలో వైద్యం కన్నా రెఫర్లు ఎక్కువ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. క్షతగాత్రులకు లేనిపోనివి చెప్పి తిరుపతి లోని రూయా, స్విమ్స్, సీఎంసీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై దృష్టి సారించాలని డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి యూనిఫాం సరఫరా చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. డీఐవో రవిరాజు మాట్లాడుతూ టీబీ నివారణకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే చెయ్యాల్సిన ఇంజక్షన్లను ప్రతి పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ త్వరలో వేరుశనగ విత్తనాల పంపిణీ చేపడతామన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున నూతన ప్రతిపాదనలు, తీర్మానాలు చేయలేదని తెలిపారు. వైస్ చైర్మన్లు రమ్య, డీపీవో లక్ష్మి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

కాణిపాకంలో పనిచేయని ఏటీఎం

- భక్తులకు తప్పని తిప్పలు



ఐరాల(కాణిపాకం), మే 18: కాణిపాక ఆలయానికి సమీపంలోని ఏటీఎం మూడు నెలలుగా పనిచేయక భక్తులు అవస్థలు పడుతున్నారు. ఎక్కువ శాతం యాత్రికులు చేతిలో నగదు ఉంచుకోరు. దర్శనానంతరం ప్రసాదాలు, ఇతరాల కొనుగోలుకు డబ్బులు లేక దగ్గరే ఉన్న ఏటీఎంను ఆశ్రయిస్తుంటారు. అయితే అది పనిచేయకపోవడంతో బస్టాండ్‌కు అవతల ఉన్న ఏటీఎంలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

కార్వేటినగరం, మే 18: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 20 నుంచి జూన్ 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆలయ ప్రవేశద్వారం, అలంకార మండపం, ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పల్లెల్లో దాహం...దాహం..!

- గంగ కోసం ఐదు గ్రామాల జనం కటకట
- చాలని ట్యాంకర్ల నీరు
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు



పెద్దబెస్తపల్లిలో ట్యాంకర్ నుండి తాగునీరు పట్టుకుంటున్న మహిళలు, బాలిరెడ్డిగారిపల్లిలో నీటిమట్టం తగ్గిన ప్రభుత్వ బోరు

కల్లూరు, మే 18: పులిచెర్ల మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు ఆరు నెలలుగా తాగు నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని అయ్యావాండ్లపల్లి పంచాయతీ జ్యోతినగర్, నల్లగుట్టపల్లి, పెద్దబెస్తపల్లి, దేవళంపేట పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి, వెంకటదాసరపల్లి పంచాయతీ పొట్టిశిద్దారెడ్డిగారి పల్లిలో ఆరు నెలల క్రితం తాగునీటి సమస్య మొదలైంది. మూడు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రం కావడంతో ఆయా గ్రామాలకు పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మంచినీటి సరఫరా బోర్లలో నీటి మట్టం అడుగంటిపోవడంతో సమస్య తలెత్తింది. ఒక వైపు మండు వేసవికాలం కావడం, మరో వైపు నీటి ఎద్దడి నెలకొనడంతో తాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారు. జ్యోతినగర్‌లో సుమారు 100 కుటుంబాలు, నల్లగుట్టపల్లిలో 25 కటుం బాలు, పెద్ద బెస్తపల్లిలో 70 కుటుంబాలు, బాలిరెడ్డిగారిపల్లిలో 32 కుటుంబాలు, పొట్టిశిద్దారెడ్డి గారిపల్లిలో 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఈ ఐదు గ్రామాల్లో వందల సంఖ్యలో పశువులు ఉన్నాయి. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే చాలీచాలని నీళ్ల పశువులకే చాలడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతి రోజూ గ్రామాలకు సమీపంలోని వ్యవసాయ బోర్లు, గ్రామాల్లోని ప్రైవేటు వ్యక్తుల బోర్ల వద్ద తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు



మా ఊళ్లోని తాగునీటి బోరులో నీరు అడుగంటిపోయి మూడు నెలలైంది. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అవి చాలడం లేదు. అధికారులు స్పందించి మరిన్ని ట్యాంకర్ల నీరు సరఫరా చేయాలి.

- శోభ, నల్లగుట్టపల్లి

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మా గ్రామంలో మూడు నెలలుగా మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీళ్ల మూగజీవాలకే సరిపోవడం లేదు. రైతుల బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నాం.

- లలితమ్మ, నల్లగుట్టపల్లి

అవస్థలు పడుతున్నాం

ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేసే అరకొర నీటితో అనేక అవస్థలు పడుతున్నాం. ఆరునెలలుగా తాగునీటి సమస్య ఏర్పడింది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

- నీరజ, పెద్దబెస్తపల్లె

ట్యాంకర్ల నీళ్లు ఆవులకే చాలడంలేదు

మా గ్రామాల్లో అధికంగా పశువులు, గొర్రెలు ఉన్నాయి. ట్యాంకర్ల ద్వారా తోలే నీళ్లు ఆవులకే చాలడంలేదు. వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

కుమారి, పెద్దబెస్తపల్లె

సమస్యను పరిష్కరిస్తాం

బోర్లలో నీటిమట్టం తగ్గడంతో సమస్య తలెత్తింది. ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నాం. బోర్లను డీప్లింగ్ చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

- రాజేంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభం



క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్లు

చిత్తూరు (సెంట్రల్), మే 18: చిత్తూరు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ (డీటీసీ)లో 35 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఎన్యూవల్ ట్రైనింగ్ శనివారం క్యాంపు కమాండింగ్ అధికారి మేజర్ లోకనాథన్ ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఢిల్లీలో జరగనున్న ఆలిండియా థలసైనిక్, ఐజీసీ, ఆర్‌డీసీ క్యాంపు సెలక్షన్ ప్రక్రియలో భాగంగా క్యాడెట్లకు తుపాకీ, డ్రిల్, ఆబ్‌స్టికిల్, మ్యాప్ రీడింగ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, ఆర్మీ సిబ్బంది చైత్రి, మహేష్, సరోజ, మల్లిక్, బిందు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గంజాయి విక్రయాలు

గుడిపాల, మే 18: మండలంలో జోరుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న ప్రచారం సాగుతోంది. 197 రామాపురం, దళితవాడ, బొమ్మసముద్రం, నంగమంగళం, గొల్లమడుగులో గంజాయి విక్రయాల కారణంగా పిల్లలు వాటికి బానిసవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాల వద్ద విక్రయాలు అధికంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. పోలీసు అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ప్రభుత్వ అతిథి గృహం



కార్వేటినగరం, మే 18: స్థానిక బాలికల హాస్టల్ పక్కన గుట్ట ప్రాంతంలో నిర్మించిన ప్రభుత్వ అతిథిగృహం అలంకారప్రాయంగా మారింది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో దీన్ని వాడకుండా అలాగే వదిలేశారు. ప్రహరీగోడ నిర్మించలేదు. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి నుంచి అతిథిగృహానికి వెళ్లడానికి రోడ్డు నిర్మించలేదు. రెండేళ్లవుతున్నా సౌకర్యాల గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



ఆలయ ప్రవేశ ద్వారానికి రంగులు

కార్వేటినగరం, మే 18: స్థానిక వేణగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 20 నుంచి జూన్ 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రవేశద్వారం, అలంకార మండపం, ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

23 నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

కార్వేటినగరం, మే 18: ఈనెల 23వ తేదీ నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల నుంచి పొందవచ్చునని సూచించారు.

వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, మే 18: స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ప్రభుత్వ ఓల్డేజ్ హోంలో శనివారం ఉదయం సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రక్తపోటు, చక్కెర వ్యాధులతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలపై డాక్టర్ మనోజ్‌కుమార్, ఎ.భావన పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సత్యసాయిసేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్.శేషనారాయణ, బి.పాండురంగం, గజేంద్రరెడ్డి, మనహర్, శ్రీకంఠయ్య పాల్గొన్నారు.

కాలువలను శుభ్రం చేయండి



పాలసముద్రం, మే 18: తమ గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ ప్రజలు కోరుతున్నారు. 10 నెలలుగా కాల్వలను శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. కాల్వ పక్కనే తాగునీటి బోరు ఉందని, నీరు కలుషితమవుతున్నాయని పేర్కొంటున్నారు. దోమలు వ్యాప్తి చెంది రాత్రిపూట నిద్ర లేకుండా చేస్తున్నాయన్నారు. సమస్యను సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

కోదండరామాలయ ఈవోపై విచారణ

చిత్తూరు కల్చరల్, మే 18: కోదండరామాలయ ఈవో సుబ్రమణ్యంనాయుడుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. ఆలయ బ్రహ్మోత్సవాల అనంతరం తేరును భద్రపరచడంలో ఈవో నిర్లక్ష్యం వహించడం వివాదాస్పదమైన విషయం విదితమే. దేవాదాయ శాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి దీనిపై నివేదిక తయారు చేసి డిప్యూటీ కమిషనరుకు పంపారు. కర్నూలు డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్ శనివారం చిత్తూరులో విచారణ చేపట్టారు.

రేపు విజ్ఞానసుధలో జాబ్‌మేళా

చిత్తూరు (సెంట్రల్), మే 18: స్థానిక విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి పనితీరు మెరుగుపడాలి

● సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు రూరల్, మే 18: చిత్తూరు ప్రభుత్వాస్పత్రిపై ఇటీవల ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మెరుగుపరుచుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యం సక్రమంగా అందడం లేదని, అత్యవసర విభాగంలో వైద్యం కన్నా రెఫర్లు ఎక్కువ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. క్షతగాత్రులకు లేనిపోనివి చెప్పి తిరుపతిలోని రూయా, స్విమ్స్, సీఎంసీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై దృష్టి సారించాలని డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి యూనిఫాం సరఫరా చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. డీఐవో రవిరాజు మాట్లాడుతూ టీబీ నివారణకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే చెయ్యాల్సిన ఇంజక్షన్లను ప్రతి పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ త్వరలో జిల్లాలో వేరుశనగ విత్తనాల పంపిణీ చేపడతామని చెప్పారు. జడ్పీ సీఈవో గ్లోరియా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున నూతన ప్రతిపాదనలు, తీర్మానాలు చేయలేదని తెలిపారు. వైస్ చైర్మన్లు రమ్య, డీపీవో లక్ష్మి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

జాతరలో ఎన్నికల నిబంధనలు పాటించాలి

● డీజేకు అనుమతి లేదు
● ఎస్పీ మణికంఠ చందోలు



బజారువీధిని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ, సీకే లావణ్య

చిత్తూరు, మే 18: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 21, 22 తేదీల్లో నగరంలో జరిగే నడివీధి గంగమ్మ జాతరలో డీజే కార్యక్రమానికి అనుమతి లేదని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. శనివారం ఆయన జాతర నిర్వాహకురాలు సీకే లావణ్య, కమిటీ సభ్యులతో కలిసి చర్చివీధి, బజారువీధి, శివాలయం వీధి, అమ్మవారిని నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. జాతరకు పోలీసుల సహకారం ఉంటుందని, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తామని అన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. అనంతరం సబ్ డివిజన్ కార్యాలయంలో పట్టణ ప్రముఖులు, అధికారులతో సమీక్షించారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ పావన్ కుమార్, సీఐలు ఉలసయ్య, విశ్వనాథరెడ్డి, నిత్యబాబు పాల్గొన్నారు.

గంగమ్మకు 108 కలశాలతో అభిషేకం



కలశాలతో బయలు దేరిన మహిళలు

పలమనేరు, మే18 : పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శనివారం పట్టణంలోని గాండ్ల సంఘం ఆధ్వర్యంలో మహిళలు 108 కలశాలతో జలం తీసుకొని గంగమ్మ ఆలయానికి ఊరే గింపుగా తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గంగమ్మ గుడివద్ద గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. గంగజాతర సందర్భంగా రోజుకో కుల సంఘం వారు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గాండ్ల కులస్తులు సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్య క్రమంలో గాండ్ల సంఘం నాయ కులు, అధిక సంఖ్యలో గాండ్లకుస్తులు పాల్గొన్నారు.

నంది వాహనంపై మృత్యుంజయేశ్వరుడి అభయం



చౌడేపల్లె, మే18: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుం జయేశ్వర స్వామి బ్రహ్మో త్సవాలలో 6వ రోజు నంది వాహనంపై ఆది దంపతులు ఊరేగారు. శని వారం ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధా నార్చ కులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షతులు పంచామృ తాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పగలు నంది వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింప చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఊరేగించారు. రాత్రి మరోసారి నంది వాహనంపై ఊరేగారు. మంగళ వాయిద్యాల, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు సమర్పించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయ దారులుగా జర్నలిస్ట్ రామనాథం కుటుంబ సభ్యులు, తుంగా వెంకటేష్‌బాబు, తుంగా నాగరాజు, అమరనాథ్, తుంగా భాగ్యమ్మ, శివశంకర్ కుటుంబీకులు వ్యవహరించారు.

భార్య మందలించిందని..ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, మే18: మద్యానికి బానిసైన భర్తను మందలించడంతో భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన పుంగనూరులో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.... పుంగనూరులోని బీడి కాలనీకి చెందిన బావాజాన్(34) మేస్త్రీ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. దీనిపై దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఉదయాన్నే పనికి వెళ్లకుండా మద్యం తాగాడు. ఈ విషయంపై భార్య అతడిని మందలించింది. తర్వాత ఆమె కూలి పనికి వెళ్లింది. ఆ తర్వాత అతడు పురుగులమందు తాగేశాడు. ఇంటి వద్ద ఆపస్మారకస్థితిలో పడివుండగా స్థానికులు గమనించి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

23న అఖండ సంగీత ధ్యానం

పలమనేరు, మే18 : పలమనేరు సమీపంలోని గంటా వూరు వద్ద వెలసిన శనీశ్వర ఆలయం వద్ద నిర్మించిన పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఈనెల 23న అఖండ సంగీత ధ్యాన కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు కార్య నిర్వాహకులు రవీంద్రశెట్టి, చిన్నయ్య శెట్టి తెలిపారు. 23వ తేదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సంగీత ధ్యానం, 7 గంటలకు సిరి కూచిపూడి నృత్యం, 8.30 గంట లకు అల్పాహారం, 9నుంచి 10 గంటల వరకు సీనియర్ పిరమిడ్ మాస్టర్లచే ఆధ్యాత్మిక సందేశం ఉంటుందని వివరించారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఏప్రిల్18: మండలంలోని బొమ్మయ్య గారిపల్లె పంచాయ తీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి హరి స్వామి స్వామికి అభిషేకం, అర్చనలు, చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మే18: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని పూజగానిపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ గడిదేశి గ్రామానికి చెందిన మునిరెడ్డి(65), చంద్రారెడ్డి(62) ద్విచక్ర వాహనంలో సొంతపనులపై శుక్రవారం రాత్రి పుంగనూరుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో పూజగానిపల్లె క్రాస్‌రోడ్డులో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాల య్యాయి. ఈ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు గమనించి వారిని చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సింహ వాహనంపై అమ్మవారి చిద్విలాసం

కుప్పం, మే 18: కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలలో భాగంగా ముత్తుమారెమ్మ అమ్మవారు శనివారం రాత్రి సింహ వాహనంపై పుర విహారం చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలం కరణలు చేశారు. మూలమూర్తికి హారుతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు ఆలయా నికి వచ్చి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధరకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని వైభవంగా ఊరేగించారు.

రేపు డయల్ యువర్ డీఎం

పలమనేరు, మే18 : పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈ నెల 20వ తేదీ సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. 20వతేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225678 నంబరుకు ఫోన్‌చేసి ప్రయాణికులు వారి ఫిర్యాదులు, బస్సు సర్వీసులపై సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పల్లెల్లో దాహం...దాహం..!

● గంగ కోసం ఐదు గ్రామాల జనం కటకట
● చాలని ట్యాంకర్ల నీరు



పెద్దబెస్తపల్లిలో ట్యాంకర్ నుండి తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

కల్లూరు, మే 18: పులిచెర్ల మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు ఆరు నెలలుగా తాగు నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని అయ్యావాండ్లపల్లి పంచాయతీ జ్యోతినగర్, నల్లగుట్టపల్లి, పెద్దబెస్తపల్లి, దేవళంపేట పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి, వెంకట దాసరపల్లి పంచాయతీ పొట్టిశిద్దారెడ్డిగారి పల్లిలో ఆరు నెలల క్రితం తాగునీటి సమస్య మొదలైంది. మూడు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రం కావడంతో ఆయా గ్రామాలకు పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మంచినీటి సరఫరా బోర్లలో నీటి మట్టం అడుగంటిపోవడంతో సమస్య తలెత్తింది. ఒక వైపు మండు వేసవికాలం కావడం, మరో వైపు నీటి ఎద్దడి నెలకొనడంతో తాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారు. జ్యోతినగర్‌లో సుమారు 100 కుటుంబాలు, నల్లగుట్టపల్లిలో 25 కుటుం బాలు, పెద్ద బెస్తపల్లిలో 70 కుటుంబాలు, బాలిరెడ్డిగారిపల్లిలో 32 కుటుంబాలు, పొట్టి శిద్దారెడ్డి గారిపల్లిలో 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఈ ఐదు గ్రామాల్లో వందల సంఖ్యలో పశువులు ఉన్నాయి. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే చాలీచాలని నీళ్ల పశువులకే చాలడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతి రోజూ గ్రామాలకు సమీపంలోని వ్యవసాయ బోర్లు, గ్రామాల్లోని ప్రైవేటు వ్యక్తుల బోర్ల వద్ద తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వెదురుకుప్పం, మే 18: మండలంలోని చవటగుంటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తులసి దళములు, సుగంధభరితమైన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రధాన అర్చకులు గిరి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఆధ్యాత్మికోపన్యాసం

చిత్తూరు కల్చరల్, మే 18: కొంగారెడ్డిపల్లె భాస్కరా హోటల్‌లో ఆదివారం సాయంత్రం చిత్తూరు చైతన్య సాహితీ సంస్థ, హరివిల్లు లలితకళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్యాత్మికోపన్యాసం నిర్వహిస్తున్నట్లు దాగూరు నాగిరెడ్డి తెలిపారు. ప్రముఖ రచయిత్రి శాంతభాస్కర్ భాగవతంలో స్తుతులు అంశంపై ఉపన్యసిస్తారని, సాహితీవేత్తలు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

నానికి టీడీపీ నేతల పరామర్శ



నానిని పరామర్శిస్తున్న జయశంకర్ నాయుడు

శ్రీరంగరాజపురం, మే 18: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆడిగి తెలుసుకున్నారు. మండల నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి యాదవ్, నిరంజన్‌రెడ్డి, జయరాజ్, గురునాథం, ఏసు, బాబు, హరికృష్ణ, దావీదు, ఆశోక్, భూపతి, జ్యోతి, ఆనందరావు, పూర్ణచంద్ర, చంద్రశేఖర్, పి.బాబు ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు





కలశాలతో ఆర్యవైశ్య మహిళలు - రాజరాజేశ్వరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

చిత్తూరు కల్చరల్, మే 18: బ్రాహ్మణ వీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. అగస్త్యేశ్వరాలయం నుంచి మహిళలు కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాటితో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం పురవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాయంవారిపల్లెకు ఎట్టకేలకు తారురోడ్డు



గుడిపాల, మే 18: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ దాయం వారిపల్లెకు ఎట్టకేలకు తారురోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. హైవే రోడ్డు పనుల నిమిత్తం హెవీలోడ్లతో లారీలు వెళ్లడం వల్ల కొత్తపల్లె క్రాస్ నుంచి దాయంవారి పల్లెకు పోయే రహదారి గుంతల మయంగా మారింది. రామభద్రాపురం సర్పంచ్ హరిణి హేమాద్రి నాయుడు విన్నపం మేరకు హైవే అధికారులు తారు రోడ్డు వేస్తున్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ



పూతలపట్టు, మే 18: మండలంలోని కొత్తవెంకటాపురం, పాలకూరు, కిచ్చెన్నగారిపల్లె ప్రజలకు శుచి సంస్థ డైరెక్టర్ గ్లోరి విజయకుమారి శనివారం ఉచితంగా కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. 500 కుటుంబాలకు గాను వెయ్యి మొక్కలను పంపిణీ చేశారు. శుచి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో పనిచేయని ఏటీఎం

● భక్తులకు తప్పని తిప్పలు



ఐరాల(కాణిపాకం), మే 18: కాణిపాక ఆలయానికి సమీపంలోని ఏటీఎం మూడు నెలలుగా పనిచేయక భక్తులు అవస్థలు పడుతున్నారు. ఎక్కువ శాతం యాత్రికులు చేతిలో నగదు ఉంచుకోరు. స్వామి దర్శనానంతరం ప్రసాదాలు, ఇతరాల కొనుగోలుకు డబ్బులు లేక దగ్గరే ఉన్న ఏటీఎంను ఆశ్రయిస్తున్నారు. అయితే అది పనిచేయకపోవడంతో బస్టాండ్‌కు అవతల ఉన్న ఏటీఎంలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.